క్లుప్తంగా

సర్పంచ్ సామ్రాజ్యంకు మరో పదవి

ఆకివీడు: మండలంలోని అయిభీమవరం సర్పంచ్ గాలి సామ్రాజ్యంకు మరో పదవి దక్కింది. మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలిగా కొనసాగుతున్న ఆమెకు జిల్లా సివిల్ సప్లయ్ విజిలెన్స్ కమిటీ సభ్యురాలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆమె శుక్రవారం తెలిపారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహరాజుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నాడు - నేడుతో పాఠశాలల అభివృద్ధి

వీరవాసరం: విద్యార్థులంతా చక్కటి విద్యాభ్యాసంతో అభివృద్ధి దిశలో సాగాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు అన్నారు. వీరవాసరం మండలం రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ప్రభుత్వం నాడు - నేడు పేరుతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. సర్పంచ్ గెడ్డం భారతి, ప్రధానోపాధ్యాయులు కానుకొలను శ్రీనివాస్, అంగర వేణు, గెడ్డం భాస్కరరావు ,కాయల వీరస్వామి ,పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదం రూ.86 వేలు

కాళ్ల: గణపతి నవరాత్రుల మహోత్సవంలో భాగంగా స్వామి వారి లడ్డూ ప్రసాదానికి నిర్వహించిన వేలంలో రూ. 86 వేలకు ఓ భక్తుడు దక్కించుకున్నాడు. కాళ్ల మండలం జువ్వలపాలెంలో వినాయక మండపం వద్ద లడ్డూ ప్రసాదం వేలం శుక్రవారం నిర్వహించారు. యూత్ సభ్యుడు చంపాటి రామకృష్ణంరాజు కుమారుడు మనోజ్ వర్మ 24 కేజీల లడ్డూను రూ. 86 వేలకు దక్కించుకున్నారు.

స్వామినాథన్‌కు ఘన నివాళి

ఉండి: హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ మృతికి సంతాపంగా ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలు శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద కొన్ని నిమిషాలు మౌనం పాటించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ మల్లికార్జునరావు, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

సాక్షి, భీమవరం: పట్టణంలో పారిశుధ్యం, అభివృద్ధి పనుల జాప్యంపై ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మునిసిపల్ అధికారులపై మండిపడ్డారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల ఇతర అధికారులతో సమీక్షించారు. పట్టణంలోని రైల్వే అండర్ పాస్ వద్ద వర్షం నీటి తరలింపుపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంఈ త్రినాథరావు, డీఈలు అప్పలరాజు, శ్రీనివాస్, రహీం, ఏఈలు కృష్ణమూర్తి, రవితేజ, నవ్య, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆకివీడు: దుంపగడపలోని వీ.వీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆరు అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సుజాత శుక్రవారం తెలిపారు. పొలిటికల్ సైన్సు-1, కామర్స్-3, మేథమెటిక్స్-1, లైబ్రరీ సైన్సు-1 పోస్టులకు 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీహెచ్‌డీ లేకుంటే నెట్, సెట్, స్లెట్‌లలో ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. 18-42 ఏళ్ల వయస్సుతో పాటు అనుభవం కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 5 ఏళ్ల వయస్సు సడలింపు ఉంటుందని, అభ్యర్థులు సెప్టెంబర్ 3వ తేదీలోపు దరఖాస్తులను కళాశాల ఆఫీసులో అందజేయాలని చెప్పారు.

కృష్ణంరాజుకు ఘన నివాళి

ఉండి: సినీ కళామతల్లి ముద్దు బిడ్డ, కేంద్ర మాజీ సహాయ మంత్రి రెబల్‌స్టార్ యువీ కృష్ణంరాజు మనసున్న మహారాజు అని యన ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకుడు గాదిరాజు వెంకటేశ్వరరాజు, పీవీ రామరాజు అన్నారు. ఉండి మండలం మహదేవపట్నంలోని సన్‌రైజ్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో కృష్ణంరాజు వర్ధంతి సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేసారు. ఈ కార్యక్రమంలో బుద్దరాజు బలరామరాజు, కొమ్మన నాగబాబు, యర్రా విక్రమ్, అడబాల శివ, వేగేశ్న అనంతలక్ష్మీ, పెన్మత్స రంగనప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అండగా సీఎం జగన్

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): నవరత్నాలలో లేని వాహన మిత్ర హామీ కూడా అమలు చేసి ఆటో డ్రైవర్ల అభిమానాన్ని, ప్రేమను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పొందారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటుచేసిన వాహన మిత్ర ఐదో విడత ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఐదో విడత వాహన మిత్ర ఆర్థిక సాయం భీమవరం నియోజకవర్గంలో 1,225 మందికి రూ.1,22,5000 అందించన్నారు. ఐదు విడుతల్లో ప్రభుత్వం ఒక్కొక్కరికీ రూ.50 వేలు చొప్పున సాయం అందించిందని చెప్పారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన మాటాకు కట్టుబడి సీఎం జగన్ ఏడాదికి రూ.10 వేలు చొప్పున నాలుగేళ్లుగా ఆర్థికసాయం అందజేసినట్టు తెలిపారు.

వారికి ప్రజలే బుద్ధి చెబుతారు

చంద్రబాబు 2014లో 600 హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసంచేసి, 23 సీట్లకే పరిమితమయ్యారని గుర్తుచేశారు. చంద్రబాబు, లోకేష్ అవినీతిపరులని చెప్పిన పవన్ కల్యాణ్, రోజుకో మాట, పూటకో పార్టీతో పొత్తు పెట్టుకునే చంద్రబాబులకు ప్రజలు మరోసారి బుద్దిచెప్పాడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్టు చేయడం అన్యాయమని ప్రతిపక్ష నాయకులు అంటున్నాయని, చంద్రబాబు తాను అవినీతి చేయలేదని, నీతిమంతుడిని ఎక్కడా చెప్పలేదని అన్నారు. దోచేయడం అన్యాయమా, దోచిన వారిని పట్టుకోవడం అన్యాయమా అంటూ ఆయన ప్రతిపక్షాలను ప్రశ్నించారు. ఈ సందర్భంగా వాహన మిత్ర ఐదో విడత నమూన చెక్కును ఆటో కార్మికులకు ఆయన అందజేశారు. ఆటో కార్మికులు ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను పూలదండతో సత్కరించారు. ఎమ్మెల్యేతో ఐదు కిలోల కేకును కట్ చేయించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకట రమణ, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, ఎంపీపీ పేరిచర్ల విజయసింహరాజు, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, కామన నాగేశ్వరరావు, రేవూరి గోగురాజు, చెల్లబోయిన సూర్యప్రకాష్, కొప్పర్తి సత్యనారాయణ, కొట్టి కుటుంబరావు, తిరుమాని ధనంజయ ,ముల్లి నరసింహమూర్తి, అల్లూరి నాగవల్లి, పాలవల్లి మంగ, కానుబోయిన వెంకటరమణ, కందికట్ల జాన్ ఎడ్వర్డ్, కరీముల్లా బాషా, మానుకొండ ప్రదీప్, తిరుమణి ధనంజయ, మాదిరెడ్డి శ్రీనివాస్, ఆటోయూనియన్ నాయకులు ఇంటి సత్యనారాయణ, కడలి హరిబాబు, పంపన గోపి, జీవరత్నం , పాలవలప జగన్, ములుగుర్తి కృష్ణ, పి.శివరామ్, చిన్నా, ఎం.రవి, అరేపల్లి బాలజీ, ఆటో కార్మికులు పాల్గొన్నారు.



వాహన మిత్ర ఆర్థిక సాయం పంపిణీ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పీవీఎల్, ఆటో డ్రైవర్లు

సీఎం జగన్ పాలనలో కార్మికులకు పెద్ద పీట

కాళ్ల: వాహన మిత్ర ద్వారా ఆటో డ్రైవర్లకు భరోసా కల్పిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని పీవీఎల్ నరసింహారాజు అన్నారు. వాహన మిత్ర ద్వారా లబ్ధి పొందిన ఆటో యూనియన్ సభ్యుల ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు సమక్షంలో శుక్రవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయన చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ సభ్యులంతా పాల్గొని సీఎం జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పీవీఎల్ చేతులు మీదుగా సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి కేక్ కట్ చేసి ఆటో యూనియన్ సభ్యులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం అహర్నిశలు ఆలోచన చేసే నాయకుడు మరొకరు లేరని అన్నారు. వాహనదారులంతా సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. నియోజకవర్గంలో సుమారు 1,558 మంది వాహనదారులకు ఐదేళ్లుగా రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ఆటో వాహనదారులు సీఎం సార్ థాంక్యు అంటూ నినాదాలు చేస్తూ పీవీఎల్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు బేతాళ చంటి, జొన్నల వజ్రం, గిరిడి శీను, తానేటి రవి,మద్దా కాంతారావు, పాముల రాజు సతీష్ రెడ్డియ్య, స్టీఫెన్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

సాగరమిత్ర నియామకాలు

సాక్షి, భీమవరం: జిల్లాలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పీఎంఎంఎస్‌వై)లో కాంట్రాక్ట్ పద్ధతిపై సాగరమిత్ర నియామాకాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మత్స్యశాఖాధికారి ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక ప్రాతిపదికన రోస్టర్ విధానంలో మెరిట్, ఇంటర్వ్యూ ద్వారా ఐదు సాగరమిత్ర పోస్టులను భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. ఫిషరీస్‌లో పాలిటెక్నిక్ లేదా బీఎస్సీ ఫిషరీస్, జువాలజీ, మెరైన బయోలజీ అర్హత కలిగి ఉండాలని తెలిపారు. వచ్చే నెల 4లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు భీమవరంలోని మత్స్యశాఖ సంయుక్త సంచాలకులను సంప్రదించాలని ప్రసాద్ వివరించారు.

వేలం వాయిదా

సాక్షి, భీమవరం: జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు (డీసీసీబీ) పెనుమంట్ర మండలం మార్టేరు బ్రాంచిలో శుక్రవారం నిర్వహించాల్సిన బాకీదారుల ఆస్తుల వేలం శాఖపరమైన కారణాలతో వాయిదా వేసినట్టు డీసీసీబీ సేల్స్‌మేనేజర్ కె.నాగమోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. వేలం తిరిగి అక్టోబర్ 6న మార్టేరు బ్యాంకు ఆవరణలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

చీరల వేలం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక శ్రీ దుర్గా లక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన చీరల వేలంపాట ద్వారా రూ.23,350 ఆదాయం లభించింది. ఆలయ చైర్మన్ పిప్పల సూర్యారావు, రుద్దరాజు గంగా శ్రీదేవి, కార్యనిర్వహణాధికారి గొట్టుముక్కల నాగ సీతారామరాజు పాల్గొన్నారు.

జగనన్న శాశ్వత భూహక్కుతో రైతుకు మేలు



నరసింహపురంలో జగనన్న భూ హక్కు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

భీమవరం అర్బన్: రైతులకు శాశ్వత ప్రాతిపదికన మేలు చేయడానికే జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలం నరసింహపురం గ్రామంలో శుక్రవారం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా రైతులకు భూ హక్కు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలను తెలుసుకుని, వాటి శాశ్వత పరిష్కారానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. అందులో భాగంగానే జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ పథకం పైలెట్ ప్రాజెక్టుగా భీమవరం మండలం నరసింహపురం, వీరవాసరం మండలం నేలపోగుల గ్రామాలను ఎంపిక చేసినట్టు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే దమ్ము, ధైర్యం చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు లేదని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.రవికుమార్, ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహారాజు, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, కార్పొరేషన్ డైరెక్టర్లు కామన నాగేశ్వరరావు, కొప్పర్తి సత్యనారాయణ, కొట్టి కుటుంబరావు, మానుకొండ ప్రదీప్, ఎంపీటీసీ వేగేశ్న విశాలక్ష్మి, ఉప సర్పంచ్ ఇందుకూరి ఆంజనేయరాజు, ఎం విక్టర్, కె.పాండురంగారావు, షేక్ సిద్దయ్య, ఎం కొండ, ఎస్ తిరుపతి, వేగేశ్న సుబ్బరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

ఆకివీడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మొదటి విడత విజయవంతంగా పూర్తయ్యింది. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య క్షేమాల్ని అడిగి తెలుసుకున్నారు. వారికి బీపీ, సుగర్, ఇతర వ్యాధులు, జ్వరాలు, ఇతరత్రాల ఆరోగ్య ఇబ్బందుల్ని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి స్థానికంగా ఏఎన్‌ఎంల వద్ద ఉన్న మందులు అందజేశారు. ఉన్నత వైద్యం అవసరమైన వారికి గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక క్యాంపులో నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించేందుకు ఎంపిక చేశారు. ప్రత్యేక క్యాంపులో వైద్యం పొంది, శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్య శ్రీద్వారా ఆయా స్పెషలిస్టు ఆసుపత్రులకు రిఫర్ చేయనున్నారు. మండలంలోని 16 గ్రామాల్లోని 12,126 మంది వ్యక్తులకు 8,540 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలో అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు అర్బన్ హెల్త్ వైద్యులు ఆయా ఇళ్లకు వెళ్లి పరీక్షలు నిర్వహించారు. అర్బన్ పరిధిలో 34,820 వ్యక్తులకు 33,770 మందికి ఆరోగ్య సురక్ష పరీక్షలు నిర్వహించారు.



ముస్లిం వీధిలో వైద్యపరీక్షలు చేస్తున్న అర్బన్ హెల్త్ వైద్యులు

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

కాళ్ల: ఈనెల 30వ తేదీ నుంచి మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. శనివారం మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్లో కార్యక్రమం ప్రారంభించనున్నట్లు స్పష్టం చేశారు. 30వ తేదీ నుంచి అక్టోబర్ 26 వరకు ఆయా గ్రామాల్లో గ్రామాల వారీగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం

ఉండి: ప్రజారోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండలంలోని చిలుకూరు సచివాలయ పరిధిలోని చిలుకూరు, వెలివర్రు గ్రామాల్లో ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు హాజరై ప్రారంభిస్తారు. ఈ క్యాంపు శనివారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, గైనికాలజీ, కార్డియాలజీ, జనరల్ సర్జన్‌కు సంబంధించి ప్రత్యేక వైద్యులు పాల్గొంటున్నారు. 560 రకాల వ్యాధులను గుర్తించేందుకు 25 రకాల పరీక్షలు ఈ క్యాంపులో నిర్వహిస్తారని ఎంపీడీవో ఏవీ అప్పారావు తెలిపారు.

నేడు గొరగనమూడిలో ఆరోగ్య సురక్ష

పాలకోడేరు: గొరగనమూడిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించేందుకు ప్రభుత్వ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు పాల్గొని ప్రారంభిస్తారని ఎంపీడీవో నూకల మురళి గంగాధర్ రావు తెలిపారు శిబిరంలో వైద్య బృందం రోగులకు తగిన వైద్యం చేయడంతోపాటు, అవసరమైన వారికి ఔషధాలు అందిస్తారు.

భీమవరంలో భారీ వర్షం



భీమవరం ప్రభుత్వాసుపత్రి వద్ద రోడ్డుపై నీటిలో ప్రయాణికుల పాట్లు



భీమవరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వర్షం నీరు

సాక్షి, భీమవరం: జిల్లా కేంద్రం భీమవరంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. ఉదయం 11 గంటల నుంచి సుమారు గంటన్నర పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పట్టణంలోని పల్లపు ప్రాంతాలతోపాటు ప్రధాన రహదారులు సైతం నీట మునిగాయి. పీపీ రోడ్డు, నాచువారి సెంటర్, ఫైర్‌స్టేషన్ సెంటర్, గునుపూడి, హౌసింగ్ బోర్డు కాలనీ, ఇండ్రస్ట్రీయల్ ఎస్టేట్ ఏరియా, బ్యాంకు కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వర్షం నీరు నిలిచి పోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సైతం వర్షం నీరు నిలిచిపోయింది. ప్రధాన రహదారులపై మోకాలిలోతున నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

వ్యక్తి అనుమానాస్పద మృతిపై దర్యాప్తు

కాళ్ల: తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని తండ్రి కాళ్ల పోలీసు స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తహసీల్దార్, వైద్యుల సమక్షంలో శుక్రవారం కాళ్ళ శ్మశానవాటికలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై వీరభద్రరావు తెలిపిన వివరాల ప్రకారం కాళ్ళ గ్రామానికి చెందిన పుచ్చకాయల యేషయ్య(37)కు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. అయనకు పాప,బాబు ఉన్నారు. మృతుని భార్య జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటోంది. కూలి పని చేసుకుంటూ తన ఇద్దరు పిల్లలతో కలిసి యేషయ్య జీవనం సాగిస్తున్నాడు. యేసయ్య తన ఇంట్లో ఈనెల 3న రాత్రి ఉరి వేసుకొని మృతి చెందడం గమనించిన అతని కుమార్తె తాతకు సమాచారం ఇచ్చింది. మరుసటి రోజు ఉదయం మృతదేహాన్ని కాళ్ళ శ్మశాన వాటికలో ఖననం చేశారు. మృతుని కుమార్తె బాధపడుతూ దిగులుగా ఉండటాన్ని గమనించిన తాత ప్రశ్నించగా తన తండ్రిని ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మత్తు మందు ఇచ్చి ఉరి వేసి చంపేశారని చెప్పింది. దీనిపై మృతుడి తండ్రి థామస్ తన కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని కాళ్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ టీపీ కృష్ణారావు, ఎస్సై వీరభద్రరావు, ఆకివీడు పీహెచ్‌సీ డాక్టర్లు, గ్రామ పెద్దలు సమక్షంలో శ్మశాన వాటికలో ఖననం చేసిన మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా నిర్వహించినట్లు ఎస్సై స్పష్టం చేశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

భీమవరం అర్బన్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను కలిగి ఉండాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. భీమవరం మండలం తాడేరు గ్రామంలోని రజకపేటలో వినాయక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏర్పాటుచేసిన భారీ అన్న సమారాధనను మోషేన్‌రాజు ప్రారంభించారు. ముందుగా ఆయన వినాయక స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండి సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



రజకపేటలో అన్నసమారాధనను ప్రారంభిస్తున్న శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు

పెరిగిన వేలం పాటల ఆదాయం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక శ్రీ మావుళ్లమ్మవారి దేవస్థానంలో భక్తులు సమర్పించుకున్న చీరలు, జాకెట్టు ముక్కలు, కొబ్బరి చెక్కలు పోగు చేసుకొనే హక్కు కోసం టెండరు కమ్ బహిరంగవేలం నిర్వహించినట్టు సహాయ కమిషనర్, ఈఓ యర్రంశెట్టి భద్రాజి తెలిపారు. రెండేళ్ల కాలపరిమితికి నిర్వహించిన ఈ వేలంపాటలో చీరలు, జాకెట్టు ముక్కలు మొదలగునవి పోగుచేసుకొనేందుకు గుత్తుల చినరాజు రూ.57,75,000 దక్కించుకున్నట్టు చెప్పారు. రెండో ఏడాదికి 10 శాతం అదనంగా పెంపుదల ఉంటుందని తెలిపారు. గత ఏడాది కన్నా రూ.11,33,000 అదనంగా ఆదాయం వచ్చిందని చెప్పారు. కొబ్బరి చెక్కలు పోగుచేసుకొనే హక్కు బండారు లోకనాథ వెంకట నాగేశ్వరరావు రూ.13,55,000 దక్కించుకున్నారు. గతేడాది కంటే రూ. 3,10,000 అదనముగా ఆదాయం వచ్చిందన్నారు. ఈ వేలంపాట పర్యవేక్షకులుగా దేవదాయ శాఖ, తనిఖీదారు, వి.వేంకటేశ్వరరావు, ఆలయ చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ప్రధాన అర్చకస్వామి మద్దిరాల మల్లికార్జున శర్మ, ధర్మకర్తల మండలి సభ్యులు, ఈఓలు ఎం అరుణకుమార్, తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

వీరవాసరం: నందమూరి గరువు శివారు ముత్తరాజ్ గూడెంలో పేకాట శిబిరంపై దాడి చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పి.రమేష్ శుక్రవారం తెలిపారు. రూ.5,820 నగదు, ఆరు సెల్ ఫోన్లు సీజ్ చేసి, కేసు దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు.

దాతల కృషి అభినందనీయం

భీమవరం అర్బన్: విశ్వశాంతి వృద్ధాశ్రమ అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఆశ్రమ నిర్వాహకులు గొట్టుముక్కల రామరాజు, కృష్ణంరాజు, వెంకటేశ్వర రాజు అన్నారు. భీమవరం మండలం చినఅమిరం గ్రామంలో విశ్వశాంతి వృద్ధాశ్రమం వద్ద శుక్రవారం వృద్ధాశ్రమ నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరున్నర దశాబ్దాల క్రితం 10 మంది వృద్ధులతో ప్రారంభమై ప్రస్తుతం 100 మందికి సేవలు చేయడానికి దాతలు కల్పించారన్నారు. దాతల సహకారంతో 35 గదులు నిర్మించామన్నారు. మళ్లీ నూతన భవన నిర్మాణానికి రూ.3 కోట్లు దాతలు అందించారని చెప్పారు. భవిష్యత్తులో 150 మంది వృద్ధులకు సేవచేసే విధంగా ప్రణాళిక సిద్ధ చేస్తున్నట్టు తెలిపారు. సంఘ సేవకులు రంగసాయి వృద్ధాశ్రమ అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నూతన భవన నిర్మాణ సారధి బి.సత్యనారాయణరాజు, కలిదిండి గోపాలకృష్ణంరాజు, పాతపాటి మురళీ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి చెడుగుడు పోటీలు

పాలకోడేరు: కుముదవల్లిలో అక్టోబర్ 1న చెడుగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నవశక్తి యువజన సంఘం ప్రకటించింది. సాయంత్రం 4 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని, రూ.800 రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కమిటీ నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ఆరు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. మొదటి బహుమతి రూ.25,000, రెండో బహుమతి రూ.20,000, మూడో బహుమతి రూ.15,000, నాలుగో బహుమతి రూ.10,000, ఐదో బహుమతి రూ.8,000 ఆరో బహుమతి రూ.6,000 అని తెలిపారు. కుముదవల్లి కాలనీ స్కూల్ గ్రౌండ్లో ఈ పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. వివరాలకు నవశక్తి యువజన సంఘం ఫోన్ 6300337276, గోగులమండ యాకోబు 9177375630, జంగం సుదర్శన్ 9542192929 నంబర్లను సంప్రదించాలని కోరారు.